
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 26.0 । కనిష్ఠం : 21.0
ANDHRAJYOTHY
5
జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
శుక్రవారం 27 డిసెంబరు 2024



హామీలు అమలు చేయాలి

అమరచింత, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు గౌడ్, చిన్న బాలరాజులు కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా.. ఆరు గ్యారెంటీల్లో కొన్ని మాత్రమే అమలు అవుతున్నాయని, మిగతావి తక్షణమే అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆంక్షలు లేకుండా రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయడంతో పాటు రైతు భరోసా, పెంచిన పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం తక్షణమే అమలు చేయాలని కోరారు.

కమ్యూనిస్టులు ఐక్యం కావాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ

6



సోమశిల వద్ద కృష్ణానదిలో అమెరికన్ వాటర్ స్పోర్ట్స్ బోట్

కృష్ణానదికి కొత్త శోభ

- త్వరలోనే అమెరికన్ వాటర్ స్పోర్ట్స్ ప్రారంభం
- ప్రకృతి అందాలను ఆస్వాదించనున్న పర్యాటకులు



సోమశిల వద్ద కృష్ణానది వీఐపీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రచార హోర్డింగ్

6

సమ్మె ఎఫెక్ట్

సాగని బోధన

- ఉమ్మడి జిల్లాలో 2,827 మంది సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు
- కేజీబీవీ సీఆర్టీ, పీజీసీఆర్టీ, ఎస్‌వోలు సమ్మెలోనే
- పదిహేడు రోజులుగా నిరసన
- పది, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నా పూర్తికాని సిలబస్

ఓ పక్క సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు.. మరోపక్క విద్యార్థులు బోధన సాగక ఆందోళనలో పడ్డారు.. అసలే పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న తరుణంలో ఈ సమ్మె ప్రభావం విద్యార్థులపై పడినట్లుంది.. పదిహేడు రోజులుగా ఈ సమ్మె కొనసాగుతుండటం గమనార్హం. సమ్మె ఎఫెక్ట్ కారణంగా విద్యార్థులతో పాటు విద్యా శాఖలోని కొన్ని విభాగాలు వెలవెలబోతున్నాయి.

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టడంతో కేజీబీవీలు, ఎంఆర్సీ, డీఈవో కార్యాలయంలోని కొన్ని విభాగాలు వెలవెల బోతున్నాయి. కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో బోధన నిలిచిపోయింది. బాలికలకు రక్షణ, అల్పాహారం, భోజనం అందించడానికి ప్రతీరోజు ఇద్దరు సిబ్బంది మాత్రం వస్తున్నారు. మిగతా వారంతా సమ్మెలో కొనసాగుతున్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఎంఆర్సీలలో పనిచేసే సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు కూడా సమ్మెలో ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,827 మంది సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు ఈ నెల 10 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. గత ఎన్నికల ముందు అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ఇప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హన్మకొండ సభలో తమ ప్రభుత్వం ఏర్పడితే సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చారని.. అది ఏమైందని ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 19,500 మందికి పైగా ఉన్న సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి తమకు ఉద్యోగ భద్రత కల్పించి పేస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తమకు ఇచ్చిన హామీ అమలు చేసే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని జేఏసీ నాయకులు, ఉద్యోగులు డిమాండ్ చేస్తు న్నారు.

బోధన సమస్య రాకుండా చర్యలు



సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు, కేజీబీఈవీలలో పనిచేస్తున్న బోధన సిబ్బంది సమ్మె చేయడం వల్ల కేజీబీవీలో చదివే విద్యార్థులకు బోధన సమస్య రాకుండా చర్యలు తీసకున్నాం. కేజీబీవీలకు షిఫ్టుల మాదిరి ప్రభుత్వ టీచర్లను పంపించి విద్యార్థులకు సబ్జెక్టు వారీగా బోధన చేయాలని ఆదేశించాం. ఈ బాధ్యత సంబంధిత మండల విద్యాశాఖ అధికారులకు అప్పజెప్పాం.

- ఎ.ప్రవీణ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, మహబూబ్‌నగర్



పాలమూరు పట్టణంలోని ధర్నా చౌక్ వద్ద సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు(ఫైల్)

- నిరవధిక సమ్మెలో ఉద్యోగులు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 72 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో

(మిగతా 6వ పేజీలో)

మార్కండేయకు

మోక్షం

- సంక్రాంతి లోపు రిజర్వాయర్ లిఫ్టు ప్రారంభానికి సన్నాహాలు
- జోరుగా సాగుతున్న పనులు
- వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్న ప్రజలు
- తీరనున్న తాగు, సాగునీటి కష్టాలు



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మోటార్లు

బిజినేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఆశలు, ఎన్నెన్నో సమస్యలు.. మరెన్నో అడ్డంకులు ఎదురైనా పట్టు వీడని విక్రమార్కుడిలా పట్టుబట్టి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మార్కండేయ లిఫ్టు పనులు చివరి దశకు తీసుకొచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని శాయిన్‌పల్లి శివారులో మార్కండేయ రిజర్వాయర్ నిర్మించారు. కేఎల్ఐ ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు సాగు, తాగు నీరు అందుతున్నప్పటికీ మమ్మాయిపల్లి, శాయిన్‌పల్లి, పోలేపల్లి, గంగారం, లట్టుపల్లి గ్రామాలతో పాటు 15 తండాలకు సాగు, తాగు నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో రూ.77 కోట్ల వ్యయంతో కేఎల్ఐ పథకంలో భాగంగా 0.6 టీఎంసీతో మార్కండేయ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల చేపట్టారు. ఏడాది కాలంలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టు పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేళ్లైనా పూర్తి చేయలేదు. ఎలాగైనా మార్కండేయ లిఫ్టు ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలనే సంకల్పంతో కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి వేగంగా పనులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నారు. భూసేకరణ, పరిహారం వంటి సమస్యలను పరిష్కరించి సంక్రాతి పండుగకు లిఫ్టును ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పది రోజుల్లో ప్రారంభోత్సవం



మార్కండేయ రిజర్వాయర్ లిఫ్టును పది రోజుల్లో ప్రారంభించి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.26 కోట్లు విడుదల చేశాం. పది రోజుల్లోగా లిఫ్టును ప్రారంభించి ప్రజల తాగు, సాగునీటి కష్టాలు తీసుస్తాం. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

- డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే

ప్రజల తరఫున కృతజ్ఞతలు



గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఓట్లు దండుకునేందుకు అద్దె ప్యానల్ బోర్డు తీసుకొచ్చి మోటర్లు ఆన్ చేసి మాయ చేసింది. కొంత ఆలస్యమైనా రైతులకు శాశ్వతంగా నీళ్లు ఇచ్చేందుకు పాటుపడిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఈ ప్రాంత రైతులు రుణపడి ఉంటారు. ఓట్ల కోసం కాకుండా ప్రజల అవసరాలు గుర్తించి పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నా.

- మస్నూరి అవంతి, మాజీ సర్పంచ్, శాయిన్‌పల్లి

ప్రభుత్వ బడుల్లో ఫొటోల ప్రదర్శన

- డుమ్మా కొట్టే టీచర్లపై ప్రత్యేక నిఘా
- సబ్జెక్టు, ఫోన్ నెంబర్లతో సహా ప్రదర్శన
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

ప్రభుత్వ పాఠశాలల్లో విధులకు డుమ్మాకొట్టే టీచర్లకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని మారుమూల గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న కొందరు టీచర్లు సమయ పాలన పాటించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ పాఠశాల తరగతి గదిలో పాఠ్యాంశాల వారీగా ఉపాధ్యాయుల ఫొటో, ఫోన్ నంబరు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకవేళ టీచర్ రాకపోతే పాఠశాలలో ఏర్పాటు చేసిన టీచర్ ఫోన్ నెంబరుకు కాల్ చేసి సమాచారం తెలుసుకు నే అవకాశం ఉంటుంది.

- వనపర్తి రూరల్, ఆంధ్రజ్యోతి

6



చిట్యాల ప్రభుత్వ పాఠశాల

ప్రమాదాలకు కారణమవుతున్న

మైనర్ల ర్యాష్ డ్రైవింగ్..

- మద్యం తాగి వాహనాలు నడుపుతున్న బాలురు
- కాలనీల్లో భయాందోళనకు గురవుతున్న ప్రజలు



గద్వాలలో మైనర్ నడపడంతో ప్రమాదానికి గురైన కారు (ఫైల్)

మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ గద్వాల పట్టణ ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. ఈ క్రమంలోనే తమ పిల్లలను బయటకు వెళ్లనీయకుండా చిన్నారుల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మైనర్లు ద్విచక్రవాహనాలతో పాటు కార్లను కూడా నడపడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొందరు మైనర్లు ఏకంగా కృష్ణా రోడ్‌లో బైక్, కార్ల రేసులు కూడా పెట్టుకుంటున్నారని, అందులో పోలీసు సిబ్బంది పిల్లలు కూడా ఉన్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

- గద్వాల క్రైం, ఆంధ్రజ్యోతి

6

భక్తిశ్రద్ధలతో మహా మండల పూజ



అయ్యప్ప స్వామి ఆలయంలోనికి నైవేద్యం తీసుకుని వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి

7

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీలో గందరగోళం

- సివిల్ సర్జన్ ధ్రువీకరణ తప్పనిసరని విద్యాశాఖ ఉత్తర్వులు
- వసూళ్లకు తెర లేపిన సివిల్ అసిస్టెంట్ సర్జన్లు
- వారు జారీ చేసిన ధ్రువపత్రాలను నిరాకరిస్తున్న ఎంఈవోలు
- అయోమయంలో కొత్త ఉపాధ్యాయులు

7

ఆటల సందడి మొదలైంది

- పాలమూరుకు చేరుకున్న పలు జిల్లాల క్రీడాకారులు
- నేటి నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీ

7



సాధన చేస్తున్న ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

జోగులాంబ గద్వాలకు

5 స్టార్ గ్రేడ్

- సీఎం కప్ మండల, జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు గుర్తింపు
- జిల్లా వ్యాప్తంగా నాలుగు క్యాంపుల ఏర్పాటు
- రాష్ట్ర స్థాయి పోటీలకు 269 మంది ఎంపిక

7

టాయిలెట్స్ ఓపెన్..

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
- నెలరోజుల మూతకు మోక్షం
- మహిళలకు తొలగిన కష్టాలు

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద టాయిలెట్స్ ఓపెన్ చేశారు. నెలరోజులుగా మూతబడిన టాయిలెట్స్ అంశంపై ఈ నెల 22న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'టోల్ ప్లాజా వద్ద టాయిలెట్స్‌కు తాళం' అన్న కథనానికి హైవే నిర్వహణ అధికారులు స్పందించారు. గురువారం ట్యాంకరు ద్వారా నీళ్లు తెప్పించి గదులన్నింటినీ శుభ్రం చేయించారు. ట్యాంకులలో ప్రయాణికులకు మరుగుదొడ్లు, స్నానపు గదులు, టాయిలెట్స్ గదులను అందుబాటులోకి తెచ్చారు. నెలరోజులుగా ఈ టాయిలెట్స్ మూతబడి ఉండటంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద తెరుచుకున్న టాయిలెట్లు

సీఎంఆర్ ధాన్యం చోరీ

- 300 బస్తాలు తీసుకెళ్లిన దుండగులు
- విచారణ చేస్తున్న పోలీసులు

ఎర్రవల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం నిల్వ చేసిన సీఎంఆర్ ధాన్యాన్ని గుర్తు తెలియని దుండగులు దాదాపు 300 బస్తాలను చోరీ చేశారు. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఉన్న విజయ వర్ధిని ఆయిల్ మిల్లులో ప్రభుత్వానికి సంబంధించిన ఒక లక్ష యాభై వేల బస్తాల ధాన్యాన్ని నిల్వ ఉంచారు. వీటిని మిల్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పాల్సి ఉంటుంది. వీటికి కాపలాగా ఒక వ్యక్తిని నియమించినప్పటికీ బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. కాపలాదారుడి సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బస్తాలను లెక్కించారు. అందులో దాదాపు 300 బస్తాలు చోరీ జరిగనట్లు గుర్తించారు. గోదాం లీజ్‌కు తీసుకున్న హరినాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజు, ఎస్ఐ వెంకటేష్

క్రీడలతో మానసికోల్లాసం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

శ్రీరంగాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో కృష్ణకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకరులకు కిట్ల పంపిణీ కార్యక్రమానికి చిన్నారెడ్డి హాజరై కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడాల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంకట్‌రాములు యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు గౌని కోదండరామిరెడ్డి, వనపర్తి జిల్లా మత్స్యకార్మిక చైర్మన్ చైర్మన్ నందిమల్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే దొంగతనం

- బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ


చోరీ జరిగిన ఇంట్లో చెల్లాచెదురుగా పడిఉన్న వస్తువులు

మిడ్జిల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న గ్రామంలో పట్టపగలే చోరీలకు పాల్పడుతుంటే మారుమూల గ్రామాల పరిస్థితి ఏంటోనని పలు గ్రామాలకు చెందిన ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి గ్రామంలో పట్టపగలే రెండిళ్లలో చోరీలకు పాల్పడటంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మునీర్ ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఒక తులం బంగారం, 35 తులాల వెండి, రూ. 35వేల నగదు, పక్కనే ఉన్న వస్పరి కృష్ణయ్య ఇంట్లో 20తులాల వెండి, రెండు మాసాల బంగారం చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం బృందానికి సమాచారం అందించారు. క్లూస్‌టీం సీఐ రాజేందర్ ఆధ్వర్యంలో బృందం శ్రీకాంత్‌తో పాటు పలువురు బోయిన్‌పల్లి గ్రామంలోని చోరీకి గురైన ఇళ్లలో ఆనవాళ్లను సేకరించారు. పోలీస్ సీఐ నాగార్జున గ్రామంలోని చోరీకి పాల్పడిన ఇళ్లను పరిశీలించారు. ఇళ్లల్లో విలువైన వస్తువులను ఉంచరాదని, ఉన్నచోట జాగ్రత్తలు చేపట్టాలని ప్రజలకు వివరించారు. గ్రామంతో పాటు జడ్చర్ల నుంచి కల్వకుర్తి వరకు ఉన్న సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తున్నామని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సమ్మె ఎఫెక్ట్

సాగని బోధన

(మొదటిపేజీ తరువాయి)

ఆరు నుంచి పదో తరగతి వరకు కొన్ని కేజీబీవీలు కొనసాగుతుండగా, మరికొన్నింటిలో ఆరు నుంచి ఇంటర్మీడియట్ కూడా కొనసాగుతుంది. 2,827 మంది సమగ్రశిక్షా అభియాన్ కాంట్రాక్టు సీఆర్టీలు, పీజీసీఈఆర్టీలు, ఎస్‌వోలు ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 625 మంది, నాగర్‌కర్నూల్‌లో 750 మంది, జోగుళాంబ గద్వాల జిల్లాలో 470 మంది, వనపర్తి జిల్లాలో 518 మంది, నారాయణ పేట జిల్లాలో 450 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో అత్యధికంగా కేజీబీవీలలో పని చేసే కాంట్రాక్టు బోధన సిబ్బంది ఉన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో వీరంతా గత పదిహేడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో కేజీబీవీలో బోధన ముందుకు సాగడం లేదు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫిబ్రవరిలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 5 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలు మొదలు కానున్నాయి. విద్యార్థులకు పరీక్షలను దృష్టిలో ఉంచుకొని సిద్ధం చేయాల్సిన సమయంలో బోధన చేసే ఉద్యోగులంతా సమ్మెబాట పట్టడంతో విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడనుంది. ఇక్కడ జరుగుతున్న విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లే సీఆర్టీలు, ఇతర ఉద్యోగులు కూడా సమ్మెలోనే ఉండటంతో మండల వనరుల కేంద్రాలు కూడా మూతపడ్డాయి. దీంతో విద్యార్థుల పరిస్థితి అయోమయంగా తయారైంది.

● ప్రభుత్వ ఉపాధ్యాయులతో కేజీబీవీలో బోధనకు ప్రయత్నం

కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో బోధన ఉద్యోగులు మొత్తం సమ్మెబాటలో ఉండటంతో ప్రభుత్వం వారి సమస్యలను తీర్చకుండానే, కేజీబీవీలో చదివే విద్యార్థులకు బోధన చేసేందుకు ప్రభుత్వ పాఠశాలలో పని చేసే సబ్జెక్టు టీచర్లను పంపి బోధన చేసేందుకు చర్యలు చేపట్టినా అనుకున్న స్థాయిలో అమలుల్లోకి రావడం లేదు. చాలామంది ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పాఠశాల వదిలి కేజీబీవీలలో బోధన చేసేందుకు వెళ్లడం లేదు. అక్కడక్కడ మాత్రం ఇద్దరు, ముగ్గురు కేజీబీవీలకు వెళుతున్నారు. కేజీబీవీలకు బోధనకు వెళ్లాలన్నా అక్కడ ఉండేది బాలికలు కాబట్టి మహిళా ఉపాధ్యాయులే వెళ్లాలి. దీంతో ప్రభుత్వం అనుకున్న నిర్ణయంలో అంత సులువుగా అమలు కావడం కష్టమే. సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించడమే సరైన మార్గమని సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు చెపుతున్నారు.

● గతంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి అమలు చేయాలి



సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలపై గత ఎన్నికల ముందు ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలని అడుగుతున్నాం. తాము వేరే ఏమీ అడగడం లేదు. తమ సమస్యలు వెంటనే పరిష్కరిస్తే సమ్మె విరమించి విద్యార్థులకు బోధన చేస్తాం.

- డీఎం ప్రమీల, కేజీబీవీ ఉద్యోగి

● విద్యార్థులకు నష్టం జరుగకుండా చూడండి



తమ సమస్యల కోసం సమ్మె చేయడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు. గత పదహారు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావడం లేదు. తమ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని ఓ జీవో ఇవ్వండి. తాము విధుల్లో చేరుతాం.

- కవిత, కేజీబీవీ ఎస్‌వో, మిడ్జిల్

● సమస్య పరిష్కరిస్తారని ముఖ్యమంత్రి మీద నమ్మకం ఉంది



సమగ్రశిక్షలో గత కొన్ని ఏళ్లుగా తక్కువ వేతనంతో పనిచేస్తున్నాం. గత ప్రభుత్వం ఉన్న సమయంలో తాము ధర్నాలు, ఆందోళనలు చేస్తున్న సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీసమస్యను చాయితాగినంత సమయంలో తీరుస్తామన్నారు. ప్రభుత్వం వచ్చింది రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు.. కానీ మా సమస్య పరిష్కారం కాలేదు. అందుకే నిరసన చేస్తున్నాం. తమ సమస్యలను ముఖ్యమంత్రి త్వరలోనే తీరుస్తారని నమ్మకం ఉంది. కేజీబీవీలలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో బోధన చేయడం తగదు.

- కే శ్రీనివాసులు , జేఏసీ జిల్లా అధ్యక్షుడు

● మా సమస్యలు తీర్చండి



ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి ఎన్నో హామీలు అమలు చేస్తున్నారు.. తమకు ఇచ్చిన హామీ అమలు చేయమని అడుగుతున్నా. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనంతో పని చేస్తున్న తమను విద్యాశాఖలో విలీనం చేసి పేస్కేల్ ఇవ్వమని సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్. అదికూడా ఎన్నికలముందు అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరుతున్నాం.

- రాజేశ్వరి, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్

● చాలీచాలని జీతంతో పనిచేస్తున్నాం



తాము ఎంతోకాలంగా కేజీబీవీలలో చాలీచాలని జీతంతో పని చేస్తున్నాం. ఎప్పటికైనా తమకు మంచి వేతనం వస్తుందని ఆశిస్తూ కొన్ని ఏళ్లుగా పని చేస్తున్నాం. ముఖ్యమంత్రి తమ ప్రభుత్వం ఏర్పడితే సమస్యపరిష్కరిస్తామని చెప్పారు. అదే సమస్య పరిష్కరించమని అడుగుతున్నాం.

- ప్రశాంతి, పీజీసీఆర్టీ, కేజీబీవీ మహబూబ్‌నగర్ అర్బన్

యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలి

- కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి


వాలీబాల్ ఆటలో తలపడుతున్న ఉత్తరప్రదేశ్, గుజరాత్ క్రీడాకారులు

కోస్గి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యువతను క్రీడలపట్ల ప్రోత్సహించాలని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం అండర్-19 జాతీయ స్థాయి వాలీబాల్ విజేతలకు ఐజీ సత్యనారాయణతో కలిసి బహుమతి ప్రదానం చేశారు. ప్రతి విద్యార్థి జాతీయస్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నేడు అండర్-19 జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు ప్రధానంగా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో నిర్వహించినట్లు తెలిపారు. ఇకముందు కూడా క్రీడాకారులు, పీఈటీలు ముందుకు వస్తే ఎలాంటి క్రీడలైనా ఇక్కడ నిర్వహించేం దుకు ప్రోత్సహిస్తామన్నారు.

అనంతరం విజేతలైన ఉత్తరప్రదేశ్ జట్టుకు మొదటి బహుమతి, రన్నర్ గుజరాత్‌కు ద్వితీయ బహుమతి అందజేశారు. సుమారు 32 జట్లు తలపడినట్లు వివరించారు.

● జాతీయ స్థాయి క్రీడలు ఇక్కడ జరగడం గర్వకారణం

జాతీయస్థాయి క్రీడలు మన తెలంగాణలో కొడంగల్‌లో నిర్వహించడం గర్వకారణమని ఐజీ సత్యనారాయణ తెలిపారు. యువకులు ప్రధానంగా వ్యసనాలకు అలవాటుపడకుండా క్రీడలపై మొగ్గు చూపాలన్నారు.

కార్యక్రమంలో వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, కాడ అధికారి వెంకట్‌రెడ్డి, నారాయణపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, నాయకులు బెజ్జురాములు, నాగులపల్లి నరేందర్, పీఈటీలు తదితరులున్నారు.

థండా.. థండా..

● చలిగాలులతో వణుకు

- ● రెండ్రోజులుగా పాలమూరు మేఘావృతం
- ● రోజంతా తుంపర, గాలులతో గజగజ


పాలమూరు ప్రధాన రహదారిపై తెల్లవారుజామున కమ్ముకున్న పొగమంచు

మహబూబ్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాలమూరు చలికి వణుకుతోంది.. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం పాలమూరును తాకడంతో రెండ్రోజులు మేఘావృతమైంది.. గురువారం ఈ ప్రభావం మరింత పెరిగింది. మబ్బులు కమ్మేసి ముసుగేయడంతో పాటు రోజంతా పాలమూరులో తుంపర చిరుజల్లులు కురవడం దీనికి తోడు గాలులు వీస్తుండటంతో జనం గజగజ వణుకుతున్నారు. ఇంట్లోంచి కాలు బయట పెట్టాలంటేను చలికి భయపడుతున్నారు. చాలామంది ఇళ్లల్లోనే ముసుగుతన్ని పడుకుంటున్నారు. రెండ్రోజుల పాటు పాఠశాలలకు క్రిస్మస్ సెలవులు కావడంతో విద్యార్థులు, వారిని తీసుకెళ్లే తల్లిదండ్రులకు చాలా ఊరటనిస్తోంది. లేదంటే విద్యార్థులు పాఠశాల తగగతి గదుల్లో చలికి వణకాల్సి వచ్చేది.

పాఠశాలలకు సెలవులు కావడం.. స్కూల్ బస్సులు, ఆటోలు తక్కువ సంఖ్యలో తిరగడం, రెగ్యులర్‌గా రోడ్లపై వివిధ పనుల రీత్యా వచ్చేవారు కూడా చలికి చాలావరకు బయటకు రాకపోవడంతో జిల్లాకేంద్రంలో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఇక బయటకు వచ్చే ప్రజలు స్వెట్టర్లు ధరించి వస్తున్నారు. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో మార్కెట్ అంతా బోసిపోయినట్లైంది.. ఫుట్‌పాత్ వ్యాపారంతో పాటు చాలా దుకాణాలు జనం లేక వెలవెలబోతున్నాయి. శుక్రవారం కూడా జిల్లాలో ఇదే పరిస్థితి ఉండనుంది. కాగా ఇప్పటికే దాదాపు రైతులు వరి పంటను కోసుకోవడం, అక్కడకక్కడ కొంత మిగిలి ఉన్నా రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. తేలికపాటి జల్లులు మినహా భారీ వర్షాలు కురిసే అవకాశం లేదంటున్నారు. పాల వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు, పేపర్ బాయ్స్‌కు తిప్పలు చెప్పలేనివి.

● పారిశుధ్య కార్మికులకు తప్పని తిప్పలు

పురపాలికలలో పారిశుధ్య కార్మికులు తెల్లవారుజామునే విధుల్లో చేరతారు. ఐదు గంటలకల్లా రోడ్లపై వచ్చి రోడ్డు ఊడ్చడం, మురుగు కాలువలు శుభ్రం చేయడం చేస్తుంటారు. తెల్లవారుజామున చలిలో పారిశుధ్య కార్మికులు చీపుళ్ళు పట్టి రోడ్లను ఊడుస్తారు. ఐదు గంటలకే వారి డ్యూటీ ప్రారంభం అవుతుండటంతో ఆ సమయంలో చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉండటంతో కార్మికులు అల్లాడుతున్నారు. రెండ్రోజులుగా తుఫాను కారణంగా చల్లటి గాలులు వీయడం, విపరీతంగా మంచు కురుస్తుండటంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఒక్క పాలమూరు పురపాలికలోనే 180 మంది స్వీపర్లు, 200 మందికి పైగా పారిశుధ్య కార్మికులు తెల్లవారుజామునే వీధుల్లోకి వస్తారు. ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికలలో వేల మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. ఇందులో సగం మంది వరకు స్వీపర్లుంటారు. వీరంతా జనం నిద్రలేచే సరికి రహదారులను ఊడ్చేస్తుంటారు.

కమ్ముకున్న కారు మబ్బులు

నారాయణపేట (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా వ్యాప్తంగా గురువారం కారు మబ్బులతో వాతావరణం చల్లబడింది. జిల్లాలో చల్ల బడ్డ వాతావరణంతో వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు తప్పలేదు. వాతావరణంలో మార్పు చోటు చేసుకొని చల్లటి గాలులు వీచాయి. చల్లదనం నుంచి ఉపశమనం పొందేందుకు జెర్కిన్‌లు, మఫలర్స్, ఉల్లన్ దుస్తులు ధరించారు. మరికల్, మద్దూర్‌లో తేలికపాటి వర్షం చినుకులు పడ్డాయి. ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 28 సెంటిగ్రేడ్స్, కనిష్ఠంగా 21 సెంటిగ్రేడ్స్ నమోదు అయింది.


మక్తల్ రూట్‌లో తిప్రాస్ పల్లి దగ్గర కారుమబ్బులతో ఇలా..

ప్రమాదాలకు కారణమవుతున్న

మైనర్ల ర్యాష్ డ్రైవింగ్



బాలుడి ర్యాష్ డ్రైవింగ్‌లో పాక్షికంగా దెబ్బతిన్న కారు, స్కూటీ..(ఫైల్)

గద్వాల క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కొంతకాలంగా మైనర్లు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. వీటిని నివారించాల్సిన పోలీస్ అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్‌తో పట్టణంలోని కాలనీల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తమ పిల్లలను బయటకు వెళ్లనీయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మైనర్ల వాహనాలను పట్టుకున్న మరుక్షణమే రాజకీయ నాయకుల నుంచి ఫోన్‌లు రావడంతో వదిలేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవలే పాత హౌసింగ్ బోర్డులో ఓ బాలుడి ర్యాష్ డ్రైవింగ్‌తో కారుతో పాటు మరో స్కూటీని ఢీకొట్టిన ఘటన గద్వాలలో చర్చనీయాంశంగా మారింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఓ రాజకీయ నాయకుడి ఫోన్ కాల్‌తో ఎలాంటి కేసు కూడా నమోదు చేయలేదని తెలుస్తోంది. ఈ విషయంలో మైనర్ తల్లిదండ్రులపై కేసు నమోదు కాకపోవడం.. ఈ విషయంలో భారీగా చేతులు మారినట్లు గద్వాలలో ఆరోపణలు వస్తున్నాయి.

రెండు రోజుల క్రితం ఓ బాలుడు ట్రాక్టర్ నడుపుతూ గద్వాల పట్టణంలోని నదిఅగ్రహారం సమీపంలో జాతర వద్ద దుకాణంలో పడుకున్న భార్యభర్తలపైకి తీసుకెళ్లడంతో దంపతులు ఇద్దరు గాయపడ్డారు. భార్య సరోజ పరిస్థితి విషమంగా ఉంది.

ఆగస్టు 15న గద్వాలకు చెందిన ముగ్గురు మైనర్లు ధరూర్ మెట్టు రోడ్డు మార్గంలో బైక్‌పై అతివేగంగా వస్తూ అదుపుతప్పి తప్పి వారు కిందపడటంతో పాటు ఎదురుగా ఉన్న వాహనదారులు కూడా గాయపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు జిల్లాలో ప్రతి నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అంతే కాకుండా కాలనీలలో తిరుగుతూ ప్రజలను భయాందోళలకు గురిచేస్తున్నారు. ఈ విషయంపై కాలనీవాసులు పలు మార్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమనే ఆరోపణలు వస్తున్నాయి. కొందరు మైనర్లు ఏకంగా కృష్ణా రోడ్‌లో బైక్, కార్ల రేసులు కూడా పెట్టుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో పోలీసు సిబ్బంది పిల్లలు కూడా ఉన్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం

ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మైనర్ల ర్యాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మైనర్ల ర్యాష్ డ్రైవింగ్‌పై 50 కేసులకు సంబంధించి ఫైన్ వేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. త్వరలోనే ప్రత్యేక నిఘాతో మైనర్ల ర్యాష్ డ్రైవింగ్‌కు చెక్ పెడతాం.

- బాలచంద్రుడు, ట్రాఫిక్ ఎస్ఐ

రేపటి నుంచి విద్య, వైజ్ఞానిక రాష్ట్ర సదస్సు

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నల్గొండలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర విద్యా వైజ్ఞానిక సదస్సు ఈ నెల 28, 29, 30వ తేదీలలో ఉంటుందని ఆ సంఘం పెద్దకొత్తపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ గౌస్‌పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని విద్యాశాఖ కల్పించిందని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు నల్లగొండ జిల్లా కేంద్రానికి తరలి రావాలని వారు కోరారు.

కృష్ణానదికి కొత్త శోభ


సోమశిల వద్ద కృష్ణానదిలో అమెరికన్ వాటర్ స్పోర్ట్స్ బోటింగ్

కొల్లాపూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సోమశిల వద్ద కృష్ణానదికి కొత్త శోభ సంతరించుకోనుంది. పర్యాటకులను ఆకర్షించేలా ఉత్తేజకరమైన అమెరికన్ వాటర్ స్పోర్ట్స్ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలకు చేరుకున్న అమెరికన్ వాటర్ స్పోర్ట్స్ బోటింగ్‌లు చూసి పర్యాటకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ ప్రాంతానికి చెందిన సింప్లీ గ్రూప్ వారు కృష్ణానదిలో అమెరికన్ వాటర్ స్పోర్ట్స్ కార్యకలాపాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. త్వరలోనే అమెరికన్ వాటర్ స్పోర్ట్స్‌లో భాగంగా స్పాన్ బోట్, కాయ కింగ్, పెడల్‌బోట్, ఫన్‌యాక్ బోటింగ్‌లు సౌకర్యం కల్పించనున్నారు. వీటిలో ప్రయాణించేందుకు ఇంకా టికెట్ ధరలు నిర్ణయించలేదు. మరో రెండు మూడు రోజుల్లో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిల ఆధ్వర్యంలో బోటింగ్ ప్రారంభించనున్నారు. బోటింగ్ ద్వారా సోమశిల, అమరగిరి, మల్లేశ్వరం, మంచాలకట్ట, సింగోటం గ్రామాల్లో ఉన్న కృష్ణానది అందాలు పర్యాటకులు తిలకించేలా వసతులు ఏర్పాటు చేయనున్నారు. జనవరిలో సింగోటం లక్ష్మీ నరసింహ స్వామి జాతర సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు సింగోటం శ్రీవారి సముద్రంలో పర్యటించేలా స్పీడ్ బోటింగ్ లాంచి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే అమరగిరి గ్రామ శివారులో ఎకో టూరిజం అభివృద్ధిపై రెవెన్యూ అధికారులు స్థల సేకరణకు చర్యలు చేపట్టారు. అదే విధంగా మల్లేశ్వరం, మంచాలకట్ట కృష్ణానది తీర ప్రాంతాల్లో పర్యాటకులకు తెలంగాణ టూరిజం నుంచి వసతులు కాటేజీల నిర్మాణం కోసం కసరత్తు ప్రారంభించారు. సోమశిల కృష్ణానదిలో అమెరికన్ వాటర్ స్పోర్ట్స్ కార్యకలాపాలు ప్రారంభించనుండడంతో కొల్లాపూర్ ప్రాంత యువత, పర్యాటక ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మార్చాల విద్యార్థి



కల్వకుర్తి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లాలో శుక్రవారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపికయ్యాడు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విష్ణు ఎంపికై క్రీడల్లో పాల్గొనేందుకు బయల్దేరాడు. శుక్రవారం నుంచి ఈ నెల 30వరకు జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు తరపున ఆడనున్నారని ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయుడు యాదయ్యగౌడ్ తెలిపారు. విష్ణును ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు సన్మానించారు.

కమ్యూనిస్టులు ఐక్యం కావాలి



నాగర్‌కర్నూల్ పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కందనూలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి వంద సంవత్సరాలు నిండిన చరిత్రాత్మకమైన సందర్భంలో కమ్యూనిస్టులు ఐక్యం కావాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ఎం.బాలనరసింహ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఈ డిసెంబరు 26 నాటికి భారత దేశంలో పురుడు పోసుకుని వందేళ్లు అవుతున్నదని తెలిపారు. అందుకే శత వసంతాల ఉత్సవాలు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జిల్లా పార్టీ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణ వీధుల్లో తిరుగుతూ బస్టాండ్ ఎదురుగా ఉన్న సీపీఐ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ అధ్యక్షతన జరిగిన సీపీఐ సభనుద్దేశించి ఎం. బాలనరసింహ ప్రసంగించారు. గడిచిన వందేళ్లలో భారత రాజకీయ ముఖచిత్రం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొందని పేర్కొన్నారు. కులం, మతం, ప్రాంతం, భాష అనేక అంశాలపై ప్రభావితమై దేశంలోని రాజకీయ పార్టీలు అనేక పరిణామాలు సృష్టించాయని తెలిపారు. సీపీఐ 1925 డిసెంబరు 26వ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ నగరంలో పురుడు పోసుకున్న తర్వాత నాటి నుంచి నేటి వరకు నాడు గదర్ విప్లవ వీరుల ఉద్యమ పోరాటాల వారసత్వాన్ని పునికి పుచ్చుకున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్ఎండీ.ఫయాజ్, వార్ల వెంకటయ్య, కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.నరసింహ, కే.ఏసయ్య, ఆర్.ఇంద్ర, పి.విజయ, ఈర్ల చంద్రమౌళి, పార్టీ జిల్లా సమితి నాయకులు శంకర్ గౌడ్, కృష్ణాజీ, రవీందర్, బొల్లెద్దుల శ్రీనివాస్, శివశంకర్, బండి లక్ష్మీపతి, కిరణ్, ప్రేమ్ కుమార్, ఆలేరు అంజి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో టీచర్ల ఫొటోలు



పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాల

వనపర్తి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సర్కార్ బడుల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. మెరుగైన బోధన అందించడంతో పాటు పాఠశాలలో టీచర్ల పనితీరు సమయ పాలనపై దృష్టి సారించింది. జిల్లాలో మారుమూల గ్రామాల్లోని పాఠశాలలకు కొందరు టీచర్లు సమయ పాలన పాటించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పాఠశాలలో ఎంత మంది టీచర్లు పని చేస్తున్నారు. ఎవరెవరు అనేది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ పాఠశాల తరగతి గదిలో పాఠ్యాంశాల వారీగా ఉపాధ్యాయుల ఫొటోలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో కలెక్టర్ ఆదేశానుసారం జిల్లాలో పాఠశాలకు వెళ్లే ప్రతీ ఉపాధ్యాయుడు జీపీఎస్ ద్వారా ఫొటో దిగి సంబంధిత విద్యాశాఖకు పంపించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నూతన విధానంలో భారీ మార్పులు వచ్చే అవకాశం ఉంది. ప్రతీ స్కూల్లోని తరగతి గదిలో ఆ పాఠశాలలో ఎంత మంది టీచర్లు ఉన్నారనే సమాచారంతో పాటు వారి ఫొటోలు, ఫోన్ నెంబర్లు, బోధించే సబ్జెక్టుల సహా విద్యార్థులకు వారు తల్లిదండ్రులకు తెలియజేసేలా పూర్తి వివరాలతో నోటీసు బోర్డులో ఉంచాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇలా చేయడం ద్వారా టీచర్లు వస్తున్నారా డుమ్మా కొడుతున్నారా, వచ్చిన టీచర్ ఫొటోలో ఉన్న వ్యక్తేనా విద్యార్థులకు కూడా తెలిసిపోతుంది. ఒకవేళ టీచర్ రాకపోతే బడిలో ఏర్పాటు చేసిన టీచర్ ఫోన్ నెంబరుకు కాల్ చేసి సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుంది. టీచర్ల బదిలీ అయిన సమయంలోనూ సదరు పాఠశాలకు వచ్చిన కొత్త టీచర్ ఎవరనేది తల్లిదండ్రులకు విద్యార్థులకు తెలిసే అవకాశం ఉంది. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 578 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 2,123 మంది టీచర్లు పని చేస్తున్నారు. సర్కారు తీసుకున్న నిర్ణయంతో తల్లిదండ్రులు టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో త్వరలో అమలు చేస్తాం



ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన కోసం చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల ఫోటోలతో పాటు పూర్తి సమాచారం ఉంచాలని ఆదేశాలు వచ్చాయి. త్వరలోనే అమలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి టీచర్ కచ్చితంగా అందుబాటులో ఉండాలి. అనుమతులు లేకుండా పాఠశాలకు వెళ్లకుండా ఉంటే చర్యలు తీసుకుంటాం.

- మహమ్మద్ అబ్దుల్ ఘని, ఇన్‌చార్జి డీఈవో

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి బైక్ నడుపుతూ పోలీసులకు పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ కొల్లాపూర్ కోర్టు న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ తెలిపారు. ఆదివారం గోపాల్‌పేట మండలం పొలికెపాడు గ్రామానికి చెందిన బొల్లె నాగయ్య పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం వద్ద మద్యంతాగి వాహనం నడుపుతూ వెళ్తుండగా పెద్దకొత్తపల్లి వద్ద వాహనాల తనిఖీలో పట్టుబడ్డారు. కొంత మంది మద్యం తాగి వాహనం నడుపగా వారిపై కూడా కేసు నమోదు చేసి గురువారం అరెస్టు చేసి కొల్లాపూర్ కోర్టులో హాజరు పరిచారు. బొల్లె నాగయ్యకు రెండు రోజుల జైలు శిక్ష, రూ.2వేల నగదు జరిమానా విధిస్తూ కోర్టు న్యాయాధికారి జ్యోత్స్న గుంటి తీర్పు ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు.

స్పోర్ట్స్ బాక్స్

ఆటల సందడి మొదలైంది

» పాలమూరుకు చేరుకున్న పలు జిల్లాల క్రీడాకారులు
» నేటి నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీ



స్టేడియానికి చేరుకున్న మెదక్ క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పాలమూరులో ఆటల సందడి మొదలయ్యింది. సీఎం కప్ కబడ్డీ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభం కానున్నది. పోటీల్లో పాల్గొనేందుకు పలు జిల్లాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఇప్పటికే భద్రాది కొత్తగూడెం, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జట్లు మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియానికి చేరుకున్నాయి. టోర్నమెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా క్రీడాశాఖ అధికారి (డీవైఎస్‌వో) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నీ నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మైదానంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని క్రీడా కారులకు సూచించారు. 27 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు కొనసాగుతాయని తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయని చెప్పారు. ముఖ్య అతిథులుగా ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి హాజరు కానున్నారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొనున్నారు.

వెయిట్ లిఫ్టింగ్ టోర్నీలో విజయం సాధించాలి

» డీవైఎస్‌వో శ్రీనివాస్



వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులతో డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వెయిట్‌లిఫ్టింగ్ రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా క్రీడాకారులు విజయం సాధించాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం నుంచి సీఎం కప్ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలకు ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆసీఫ్, రాఘవేందర్, సాయిసూర్యకుమార్, జస్వంత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం స్టేడియం మైదానంలో డీవైఎస్‌వో వారిని అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్‌సమీ, పీఈటీ గూలం అఫ్రోజ్ పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఖోఖో రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళలు, పురుషుల జట్ల ఎంపికకు ఈ నెల 28న ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఖోఖో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఒబేదుల్లాకొత్వాల్, విలియం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్‌లో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, బోనఫైడ్‌తో శనివారం ఉదయం తొమ్మిది గంటలకు రిపోర్ట్ చేయాలని కోరారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం, కారు ఢీ

» ఒకరికి తీవ్ర గాయాలు

కృష్ణ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం, కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు శివారులో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుడెబల్లూరు గ్రామానికి చెందిన మస్కు రమేశ్ గురువారం తెల్లవారుజామున 167వ నెంబర్ జాతీయ రహదారిపై టైరోడ్ వద్దనున్న బంకులో ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోయించుకొని రోడ్డుపైకి వస్తుండగా, రాయిచూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొన్నది. దీంతో మస్కు రమేశ్ బండి మీద నుంచి ఎగిరి కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. ప్రమాదంపై స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, బాధితుడిని రాయిచూరు ఆసుపత్రికి తరలించారు.

ఆటో చోరీ, కేసు నమోదు

గద్వాల క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని చింతల పేట కాలనీలో ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటో చోరీకి గురయ్యింది. పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతలపేట కాలనీకి చెందిన శ్రీనివాసులు ఈ నెల 24న రాత్రి ఇంటి ముందు ఆటోను నిలిపి ఉంచాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి ఆటో కన్పించలేదు. పట్టణంలోని పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉయ్యాలపై నుంచి కింద పడి చిన్నారి మృతి

ధరూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సరదాగా ఉయ్యాల ఊగుతున్న బాలిక కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరు మండలంలోని నాగర్‌దొడ్డిలో గురువారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన వెంకటేశ్, నాగమ్మల కుమార్తె సునీత(9) స్థానిక పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నది. గురువారం బడికి సెలవు కావడంతో ఇంట్లోనే ఉంది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంటి ముందున్న చెట్టుకు డ్రిప్ పైప్‌తో కట్టిన ఉయ్యాలలో ఊగుతుండగా, కొమ్మ విరిగిపోయింది. దీంతో కిందపడిన బాలిక తలకు తీవ్ర గాయమైంది. తల్లిదండ్రులు గమనించేలోపే మృతి చెందింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఊర్కొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని మున్ననూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మున్ననూర్ గ్రామానికి చెందిన చెన్నయ్య (40)కు నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన మహిళతో కొన్ని సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గత నెలలో దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లి, అక్కడే ఉంటోంది. మంగళవారం మండల కేంద్రంలో చెన్నయ్య మద్యం మత్తులో ఉండగా, భార్య గమనించి గ్రామానికి తీసుకెళ్లింది. బుధవారం ఉదయం అతడు మృతి చెందాడని కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు గ్రామానికి చేరుకున్నారు. చెన్నయ్య మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి సోదరుడు అంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.



జోగుళాంబ గద్వాలకు 5 స్టార్ గ్రేడ్

» సీఎం కప్ మండల, జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు గుర్తింపు » జిల్లా వ్యాప్తంగా నాలుగు క్యాంపుల ఏర్పాటు
» రాష్ట్ర స్థాయి పోటీలకు 269 మంది ఎంపిక » నేటి నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి పోటీలు

అయిజ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ మండల, జిల్లా స్థాయి క్రీడా పోటీల నిర్వహణలో జోగుళాంబ గద్వాల జిల్లాకు రాష్ట్ర స్థాయిలో ఫైవ్ స్టార్ గ్రేడ్ లభించింది. రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోంది. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల ఐదు నుంచి 24వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించింది. పోటీల నిర్వహణకు స్టేడియాల గుర్తింపు, ఆయా మండలాల నుంచి క్రీడాకారుల ఎంపిక, వారికి అవసరమైన వసతులు కల్పించడం, నిర్వహణా సిబ్బంది కేటాయింపు తదితర పనులను సకాలంలో పూర్తి చేసి, జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అందుకు గాను 5-స్టార్ గ్రేడ్ లభించింది.

క్రీడాశాఖ ఆధ్వర్యంలో క్యాంపులు

సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసేందుకు క్రీడాశాఖ ఆధ్వర్యంలో జోగుళాంబ గద్వాల జిల్లాలో అయిజ, ఎర్రవల్లి, గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియం, సోమనాద్రి స్టేడియంలలో క్రీడా శిబిరాలను ఏర్పాటు చేశారు. 15 రోజుల పాటు నిర్వహించిన ఆయా క్యాంపులలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, హాకీ, హ్యాండ్‌బాల్, షటిల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, అత్యా పత్యా, సెపక్‌తక్రా, చెస్, యోగా అథ్లెటిక్స్ తదితర 13 రకాల పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ కనబరిచిన 269 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంతో పాటు, వరంగల్ జిల్లా హనుమకొండ, హైదరాబాద్‌లలో ఈ నెల 27నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నారు.



కబడ్డీ సాధన చేస్తున్న రాష్ట్ర స్థాయికి ఎంపికైన జట్టు

గెలుపొందిన జట్టుకు రూ.లక్ష బహుమతి

సీఎం కప్ పోటీల్లో రాష్ట్ర స్థాయి విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ బహుమతిని ప్రకటించింది. మొదటి బహుమతిగా లక్ష రూపాయలు, రెండవ బహుమతిగా రూ. 75,000, మూడవ బహుమతిగా రూ. 50,000, నాలుగవ బహుమతిగా రూ, 25,000 ఇవ్వనున్నది. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు మరింత మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికను రూపొందించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాల్లో క్రీడా కోటా రిజర్వేషన్ వర్తింప చేయనున్నట్లు చెప్పారు.

ఫైవ్‌స్టార్ గ్రేడ్ రావడం గర్వకారణం



సీఎం కప్ మండల, జిల్లా స్థాయి క్రీడా పోటీల నిర్వహణలో జోగుళాంబ జిల్లాకు రాష్ట్ర స్థాయిలో 5 - స్టార్ గ్రేడ్ లభించడం గర్వకారణం. అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయడం వల్లే ఇది సాధ్యం అయ్యింది. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ చూపుతారనే నమ్మకం ఉంది. జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారు లకు కొందరు దాతలు ముందుకొచ్చి వసతి, భోజ నం ఏర్పాట్లు చేశారు.

- ఆనంద్, పీడీ, జోగుళాంబ గద్వాల.

క్రీడా పోటీలతో క్రమశిక్షణ



క్రీడాపోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు, యువతీ, యువకులలో క్రమ శిక్షణ పెరుగుతుంది. రాష్ట్రంలో క్రీడాభివృద్ధితో స్థానిక క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం లభిస్తుంది. అయిజ క్యాంపనకు ఇన్‌చార్జిగా ఉన్న నేను అయిదు రోజుల పాటు క్రీడాకారులకు శిక్షణ ఇచ్చాను. సీఎం కప్ నిర్వహణతో గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తోంది.

- సుబ్బన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు.

చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం



అజయ్, జమ్మిచేడు : అమ్మా, నాన్న తాపీ పని చేసి, నన్ను, అన్నను చదివిస్తున్నారు. నేను మెదక్ జిల్లా, చేగుంట మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్నాను. ఏడవ తరగతి నుంచి నాకు ఆటలంటే చాలా ఇష్టం. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నుంచి నాలుగు సార్లు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్నాను. పాలిటెక్నిక్ కళాశాలల విభాగంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయిలో ఖోఖో పోటీల్లో పాల్గొన్నాను. ఇప్పుడు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాను. భవిష్యత్తులో జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనడమే లక్ష్యం.

రాష్ట్ర స్థాయికి ఎంపికవడం సంతోషకరం



కుసుమ, పులికల్ : మా నాన్న 2010లో మరణించారు. అమ్మ కూలి పనులు చేస్తూ నన్ను చదివిస్తూ, మానసిక స్థితి సరిగాలేని చెల్లిని పోషిస్తోంది. నేను హైదరాబాదు, దోమలగూడలోని జీసీపీఈ ప్రభుత్వ కాలేజీలో బీపీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. కబడ్డీ ఆట అంటే నాకు ప్రాణం. ఇప్పటివరకు మధ్యప్రదేశ్‌లో రెండు, కర్ణాటక, పూణే, తెలంగాణ రాష్ట్రాల్లో ఒక్కొక్కటి చొప్పున నేషనల్ లెవల్‌లో పోటీల్లో పాల్గొన్నాను. ఇప్పుడు జోగుళాంబ గద్వాల జిల్లా తరపున సీఎం కప్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం సంతోషంగా ఉంది.

భక్తిశ్రద్ధలతో మహా మండల పూజ



అయ్యప్ప స్వామి పూజ చేస్తున్న అర్చకుడు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మహా మండల పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో పూజ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం గోపూజ, అయ్యప్ప మూల విరాట్‌కు అష్టాభిషేకాలు, ఆభరణాలతో ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీగణపతి హోమం చేశారు. అనంతరం ఏకశి లా పడునెట్టాంబడికి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళ హారతి, మంత్ర పుష్పం, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమానికి అయ్యప్ప స్వామి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకుని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్ప దర్శనానికి తరలివచ్చిన భక్తులు

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీలో గందరగోళం

» సివిల్ సర్జన్ ధ్రువీకరణ తప్పనిసరని విద్యాశాఖ ఉత్తర్వులు » వసూళ్లకు తెర లేపిన సివిల్ అసిస్టెంట్ సర్జన్లు
» వారు జారీ చేసిన ధ్రువపత్రాలను నిరాకరిస్తున్న ఎంఈవోలు » అయోమయంలో కొత్త ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) డిసెంబరు 26 : ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీలో గందరగోళం నెలకొనడంతో కొత్త ఉపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారు. వేతనాలు రావాలంటే సివిల్ సర్జన్ సంతకంతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు సమర్పించాలని విద్యాశాఖ నిబంధన విధించింది. వాస్తవానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సివిల్ సర్జర్లు నలుగురే ఉన్నారు. ప్రస్తుతం వారు ఆరోగ్యశాఖ అధికారులుగా ఉండటంతో సంతకాలు చేసేందుకు వీలు లేదు. ఈ నేపథ్యంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ. 500 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నారు. సివిల్ సర్జన్ పేరుతో సంతకం చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. కానీ వాటిని మండల విద్యాశాఖ అధికారులు తిరస్కరిస్తున్నారు.

1140 మంది కొత్త ఉపాధ్యాయులు

ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1140 మంది ఉపాధ్యాయులు నియమితులయ్యారు. వీరంతా అక్టోబర్ నుంచి వారికి కేటాయించిన పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ వారికి అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించిన వేతనాలు రాలేదు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పిస్తేనే వేతనాలు వస్తాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. ఆ సర్టిఫికెట్ల మీద తప్పనిసరిగా సివిల్ సర్జన్ సంతకం ఉండాలని నిబంధన విధించింది.

ఉమ్మడి జిల్లాలో నలుగురే సివిల్ సర్జన్లు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నలుగురే సివిల్ సర్జన్లు ఉన్నారు. ప్రస్తుతం వారు ఆయా జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులుగా విధులు నిర్వరిస్తున్నారు. కానీ వీరు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వడానికి వీలు లేదు. ఓపీ విభాగం చూసే వైద్యులకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ వారు పరిపాలన అధికారులుగా పని చేస్తుండటంతో సర్టిఫికెట్లు ఇచ్చేందుకు వీలు లేదు. దీంతో పాటు అన్ని జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉన్నాయి. అందులో పనిచేసే వైద్యులను ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లుగా పిలుస్తారు. దీంతో వారు కూడా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చే పరిస్థితి లేదు. జిల్లాలో సివిల్ అసుపత్రులు ఉన్నప్పటికీ వాటిల్లో అసిస్టెంట్ సర్జన్లు మాత్రమే ఉన్నారు. వారికి అర్హత లేకపోయినా డబ్బు తీసుకొని ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు.



ఏ ప్రభుత్వ డాక్టరైనా ఇవ్వొచ్చు

ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను ఏ ప్రభుత్వ డాక్టరైనా ఇవ్వొచ్చు. సివిల్ సర్జనే ఇవ్వాలనే నిబంధన ఎక్కడా లేదు. ఓపీ చూసే ప్రతీ వైద్యుడు ఉపాధ్యాయుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు అవకాశం ఉంటుంది. సివిల్ అసిస్టెంట్ సర్జన్ అయి ఉండి, సివిల్ సర్జన్ పేరుతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వొద్దు.

- డా. కృష్ణ,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

నిరాకరిస్తున్న ఎంఈవోలు

చాలా మంది ఉపాధ్యాయులు సివిల్ అసిస్టెంట్ సర్జన్, మెడికల్ ఆఫీసర్లతో సంతకం చేయించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. కానీ వాటిని కార్యాలయాల్లో సమర్పించగా, ఎంఈవోలు తిరస్కరించారు. కచ్చితంగా సివిల్ సర్జన్ సంతకంతోనే ధ్రువీకరణ పత్రం కావాలని స్పష్టం చేశారు. దీంతో ఉపాధ్యాయులు అయోమయంలో పడ్డారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి, ఏ ప్రభుత్వ డాక్టరైనా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కణతిని చంపిన దుండగుల అరెస్టు

కొల్లాపూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అడవిలో ఉచ్చుబిగించి కణతిని చంపి, మాంసాన్ని విక్రయించిన దుండగులను అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ రేంజ్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమరగిరి సెక్షన్‌లో, ఎల్లూరు శివారులోని మంగల్‌దూప్ పెంట ప్రాంతంలో వేటగాళ్లు ఉచ్చు బిగించి, కణతిని హతమార్చారు. దాని మాంసాన్ని స్థానికంగా విక్రయించారు. ఈ విషయంపై కచ్చితమైన సమాచారం అందడంతో బుధవారం సాయంత్రం అమరచింత ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ బయ్యన్న, బీట్ ఆఫీసర్ లక్ష్మయ్యలు, సిబ్బందితో కలిసి మంగల్‌దూప్ పెంట ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. కణతిని చంపేందుకు వినియోగించిన ఉచ్చులు, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అమరగిరి గూడేనికి చెందిన చెందిన నిమ్మల వెంకటస్వామి, బోడబండ తండాకు చెందిన దేశావత్ నర్సింహలను అరెస్ట్ చేశారు. వారిని గురువారం స్థానిక కోర్టులో హాజరు పరిచినట్లు ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరు నుంచి చౌరస్తాకు వెళ్లే మార్గంలో క్యాతూరు గ్రామానికి చెందిన సల్మాన్, ఉండవల్లి మండలం, బైరాపురం గ్రామానికి చెందిన ఖాజామైనుద్దీన్ బైక్‌లపై ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. సల్మాన్‌కు తీవ్ర గాయాలు కావడంతో కర్నూల్ ఆసుపత్రికి తరలించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

» ఇద్దరు నిర్వాహకులతో పాటు మరో ఇద్దరు విటుల అరెస్ట్
» ఒడిశాకు చెందిన యువతిని సఖి కేంద్రానికి తరలింపు

గద్వాల క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాతహౌసింగ్ బోర్డులో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి, నలుగురిని అరెస్ట్ చేశారు. ఓ యువతిని సఖి కేంద్రానికి తరలించారు. సంఘటనకు సంబంధించి పట్టణ ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణానికి చెందిన వెంకి, మల్దకల్ మండలంలోని పాల్వాయి గ్రామానికి చెందిన వరణ్ అనే ఇద్దరు యువకులు కొద్ది రోజుల క్రితం గద్వాల పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డులో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి యువతులను రప్పిస్తున్నారు. వారి ఫొటోలను స్థానిక యువకులకు ఆన్‌లైన్లో పంపించి పిలిపిస్తున్నారు. ఈ క్రమంలో ఒడిషా రాష్ట్రానికి చెందిన ఓ యువతిని రప్పించారు. పట్టణంలోని నల్లకుంటకు చెందిన కాశపోగు రవితో పాటు గోనుపాడుకు చెందిన కృష్ణకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు అకస్మికంగా దాడి చేశారు. నిర్వాహకులు వెంకి, వరుణ్, విటులు రవి, కృష్ణలను అరెస్ట్ చేశారు. యువతిని అదుపులోకి తీసుకొని పట్టణంలోని సఖి కేంద్రానికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఖిల్లాఘణపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిపై దాడి కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని ముందరితండాకు చెందిన నేనావత్ హర్యా కుమారుడు నేనావత్ పాండు, నేనావత్ సోమ్లాకు గతంలో పాత గొడవలు ఉండేవి. ఈ నెల 22న రాత్రి నేనావత్ పాండు తండ్రి హర్యా ఇంటి ముందు నిద్ర పోతుండగా నేనావత్ సోమ్లా, హనుమంతు, మేగ్యాలు అతడితో గొడవ పడ్డారు. అతడిని కర్రలతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు.

సంఘటనపై బాధితుడి కుమారుడు నేనావత్ పాండు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సురేశ్ గౌడ్ తెలిపారు.

ఇంటర్వ్యూ..

ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి

- నిరంజన్, ఆర్డీఎస్ డీ-30 ఏఈ



మానవపాడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా ఆర్డీఎస్ డి-30కి వచ్చే సాగునీటిని ప్రతి ఎకరాకు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆర్డీఎస్ డీ-30 ఏఈ నిరంజన్ చెప్పారు. ఖరీఫ్ నుంచి నేటికీ ప్రతీ రైతుకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందిస్తున్నామని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు. అలాగే పలు విషయాల గురించి మాట్లాడారు.

ఆర్డీఎస్ సాగునీరు వృథా అవుతుందని రైతులు అంటున్నారు మీరేమంటారు?

కాలువ వెంబడి షెటర్లు ఏర్పాటు చేసేందుకు అనుమతి వచ్చిన వెంటనే నీరు వృథా కాకుండా షెటర్లు ఏర్పాటు చేయిస్తాం.

చివరన సాగునీరు అందడంలేదని రైతులు అంటున్నారు నిజమేనా?

కాలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దిగువన ఉన్న పంటలకు నీరందాలనే ఉద్దేశంతో రాత్రివేళల్లో పైడిస్ట్రిబ్యూటర్లు బందు చేయిస్తున్నాం.

రబీ సీజన్ పంటలకు సాగునీరు అందిస్తారా?

ఖరీఫ్‌లో వేసిన మిర్చి, కంది, పత్తి పంటలకు సాగునీటిని అందించాం. రబీ పంటల సాగుకు ఫిబ్రవరి చివరి వరకు సాగునీటి అందిస్తాం.

టీబీ డ్యాం నుంచి ఎన్ని నీళ్లు వాడారు. ప్రస్తుతం మన ఇండెంట్ ఎంత?

1500క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని టీబీ డ్యాం అధికారులను కోరాం. మూడు రోజుల్లో తుమ్మిళ్ల లిఫ్ట్ వద్దకు చేరుకుంటాయి.

న్యూస్ బాక్స్

మాజీ ఎంపీని పరామర్శించిన మాజీ మంత్రులు

ఎర్రవల్లి/ ఇటిక్యాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూలు మాజీ పార్లమెంట్ సభ్యుడు మందా జగన్నాథం ఆరోగ్యం విషమంగా ఉండడంతో, విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డి, ఆంజనేయులు గౌడ్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



పాఠశాల విద్యార్థులతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నవయస్సు నుంచే క్రమశిక్షణతో చదువుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మేడికొండలో వీర్‌బల్ దీవస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో గురుకుల కోచింగ్ తీసుకుంటున్న 30మంది విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపాలకృష్ణ, భీంసేన్‌రావ్, భగత్‌రెడ్డి యువకులు బజారి, వీరేష్, శ్రీరాములు, సోమశేఖర్ పాల్గొన్నారు.

క్రిస్మస్ రెండోరోజు సంబురాలు



ఇటిక్యాలలో భక్తి గీతాలాపనలో మహిళలు

ఇటిక్యాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని రెండవ రోజు గురువారం సాయంత్రం ఇటిక్యాల మండల కేంద్రంలో ఎంబీ యేరూషలేం చర్చిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పాస్టర్ అంద్రూస్ ఆధ్వర్యంలో క్రీస్తు జననాన్ని పురస్కరించుకొని చిన్నారులు నాటికలు వేశారు. గేయాలు ఆలపించారు. అలాగే మండలంలోని ఉదండాపురం, పెద్దదిన్నె, చాగాపురం గ్రామాల చర్చిలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

ఒకే ఒక్కడు..

- వడ్డేపల్లి, అయిజ, అలంపూర్ మునిసిపాలిటీలకు ఒక్కరే కమిషనర్
- రెగ్యులర్ అధికారి లేక నిలిచిపోతున్న పనులు



అయిజ మునిసిపాలిటీ కార్యాలయం

అయిజటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు మునిసిపాలిటీలకు ఒక్కరే కమిషనర్‌ను నియమించడంతో పలు పనులు నిలిచిపోతున్నాయి. దీంతె అయిజ మున్సిపాలిటీకి రెగ్యులర్ కమిషనర్‌ను ఎప్పుడు నియమిస్తారని పుర ప్రజలు చర్చించుకుంటున్నారు. కార్యాలయంలో ఉన్నతాధికారి లేక అనేక రకాల పనులు ఆగిపోవటంతో చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంవత్సరం జూలైలో అయిజ మునిసిపాలిటీ కమిషనర్ ఉద్యోగ విరమణ పొందటంతో, అప్పటినుంచి రెగ్యులర్ అధికారి లేక ఇన్‌చార్జ్ అధికారులతో పాలన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే వడ్డేపల్లి మునిసిపాలిటీ కమిషనర్ రాజయ్యను అయిజ మునిసిపాలిటీకి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించారు. దీంతో ఆయన వీలునప్పుడు అయిజకు వస్తున్నారు. పూర్తిస్థాయి పనులపై దృష్టి సారించలేకపోతున్నారు. ఇటీవల ఆయననే అలంపూర్ మునిసిపాలిటీ అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. 20వార్డులు, దాదాపు 50వేలకు పైగా జనాభా ఉన్న అయిజ మునిసిపాటీ కార్యాలయానికి ప్రతిరోజు ప్రజలు అనేక రకాల పనుల కోసం వస్తుంటారు. కమిషనర్ స్థాయిలో జరగాల్సిన కొన్ని పనులు నాలుగు నెలలుగా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. సమీకృత మార్కెట్ సముదాయం టెండర్ల అంశం కూడా దాదాపు మూడు నెలలుగా రెగ్యులర్ కమిషనర్ లేకపోవటంతోనే ముందుకుసాగటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అయిజ మునిసిపాలిటీకి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కలెక్టర్‌ను కోరుతున్నారు.

వెలుగులోకి ప్రతిభావంతమైన క్రీడాకారులు

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డీఆర్ విజయ్‌కుమార్
- ముగిసిన డీపీఎల్ సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్



టోర్నీ విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

ధరూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పండుగలు, పర్వదినాల సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించే పోటీల ద్వారా ప్రతిభగల క్రీడాకారులు వెలుగులోకి వస్తారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డీఆర్ విజయ్‌కుమార్ అన్నారు. ఇలాంటి టోర్నమెంట్‌లు మరెన్నో నిర్వహించాలని, భవిష్యత్‌లో తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా ధరూరు మండల కేంద్రంలోని నిర్వహించిన డీపీఎల్ సీజన్-3 క్రికె ట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. పోటీల్లో మొదటి విజేతగా ఆర్డీఎస్ జట్టు, ద్వితీయ విజేతగా రైజింగ్ స్టార్ జట్టు నిలిచాయని పోటీల నిర్వాహకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డీఆర్ విజయ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి విజేతలకు (మొదటి బహుమతి రూ.20, రెండవ బహుమతి రూ.20వేలు) నగదు, ట్రోఫీ అందజేశారు. మొదటి, రెండవ బహుమతి షీల్డులను ఎస్.సంజీవ్ స్మార్ట్ స్పాన్సర్ చేశారు. పోటీల్లో బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, మ్యాన్ ఆఫ్ ది సీరీస్ బహుమతులను కాంగ్రెస్ పార్టీ గద్వాల తాలూకా జనరల్ సెక్రటరీ ధరూరు రవి స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ మేనేజ్‌మెంట్ డి.రవి, ఎస్.రాజు, కే.రవి, పరశు, మార్క్, రాజు క్రీడాకారులు ఉన్నారు.

ఐక్యతతోనే బీసీల అభ్యున్నతికి బాటలు



నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

- బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్
- బీసీ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

గద్వాల టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐక్యంగా ఉండటం, సందర్భానుసారంగా పరస్పర సహకారం అందించుకోవడం ద్వారా బీసీలు అన్నిరంగాల్లో రాణించి అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ అన్నారు. రాష్ట్ర కార్యదర్శి, స్థానిక న్యాయవాది మధుసూదన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములుతో కలిసి గురువారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో బీసీ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.గోపాల్, ప్రవీణ్, నరసింహులు, బీకే వెంకటేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, బీఆర్ఎస్ యువ నాయకులు గంజిపేట రాజు, ప్రజా సంఘాల నాయకులు ప్రభాకర్ ఇక్బాల్‌పాషా తదితరులు ఉన్నారు.

ప్రజాక్షేత్రంలో అలుపెరగని పోరాట చరిత్ర

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు
- గద్వాల లో ఘనంగా సీపీఐ శత జయంతి ఉత్సవం



గద్వాలలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

గద్వాలటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపన, అంతరాలులేని వ్యవస్థ ఏర్పాటే లక్ష్యంగా అలుపెరగని పోరాటం సాగిస్తున్న చరిత్రభారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) సొంతమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు అన్నారు. పార్టీ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని కృష్ణవేణి సర్కిల్‌లో ఆంజనేయులు సీపీఐ జెండాను ఎగరవేసి అమరులైన పోరాట యోధులకు వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ శ్రమజీవుల పక్షాన నిలుస్తూ వారి అభ్యున్నతి కోసం పోరాడి అమరులైన కమ్యూనిస్టు నేతల స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. సీపీఐ శతజయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వివిధ పార్టీలు, సంఘాల నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మధుసూదన్ బాబు, ఇక్బాల్ పాషా, ప్రభాకర్ సీపీఐ ఏర్పాటు, సాగించిన పోరాటాలు, సాధించిన విజయాలు, అమరుల త్యాగాల గురించి స్మరిస్తూ ప్రజాహితం కోసం కమ్యూనిస్టులు సాగించే పోరాటాలకు అన్నివర్గాల ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్, రైతు, కార్మిక సంఘాల నాయకులు పరేష్‌బాబు, వెంకటేష్, ప్రవీణ్, గోపాల్ రావు, ఆశన్న, తిమ్మప్ప, వెంకట్రామిరెడ్డి, పరమేష్, మస్తాన్ ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత ; కేసు నమోదు

గద్వాల క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా కేంద్రం నుంచి రాయిచూరుకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గద్వాల పట్టణంలోని పిల్లిగుండ్ల కాలనీకి చెందిన రమేశ్ అశోక్ లేలాండ్ వాహనంలో ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రాయిచూరుకు తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందడంతో, మేలచెర్వు చౌరస్తాలో తనిఖీలు నిర్వహించి వాహనాన్ని పట్టుకున్నామని ఎస్ఐ చెప్పారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, డ్రైవర్ రమేశ్‌పై కేసునమోదు చేశామని తెలిపారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్



ఎమ్మెల్సీ కవితతో బీఆర్ఎస్వీ నాయకులు

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఆమెతో మాట్లాడారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ గడ్డం భరత్‌బాబు, నాయకులు మత్తలి, కుర్వ వీరేష్, కుర్వపల్లి మాధవ్, రాజు తదితరులు ఉన్నారు.

నేడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి గట్టుకు రాక

గట్టు(గద్వాల), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం గట్టు మండలానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి చెన్నయ్య తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు గట్టు మండలానికి చేరుకుంటారని, నీతిఆయోగ్ కింద ఎంపికైన మండలంలో విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, న్యూట్రిషన్ మహిళా సంఘాల పురోగతి వంటి అంశాలపై సమీక్ష చేయనున్నారని తెలిపారు.

కోళ్ల వ్యాను బోల్తా

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి): అలంపూరు చౌరస్తా సమీపంలో 44వ జాతీయ రహదారిపై బాయిలర్ కోళ్లతో కర్నూలువైపు వెళ్తున్న బొలెరో వాహనం బోల్తాపడింది. దీంతో వాహనంలో ఉన్న డ్రైవర్ రంగస్వామికి, క్లీనర్ మన్యంకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ రాధామోహన్, పైలట్ మల్లికార్జున్ అక్కడికి చేరుకుని గాయపడ్డవారికి కర్నూలు ఆస్పత్రికి తరలించారు. పదుల సంఖ్యలో కోళ్లు మృతి చెందాయి.

పాద యాత్రికుడిని ఢీ కొన్న డీసీఎం

తిరుపతికి పాదయాత్రగా వెళ్తున్న బాటసారిపైకి డీసీఎం దూసుకెళ్లింది. బంధువులు తెలిపిన వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌కు చెందిన 12మంది తిరుప తికి పాదయాత్రగా వెళ్తుండగా, గురువారం పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద శ్రీనువాసులు అనే వ్యక్తిని వెనకనుంచి డీసీఎం వేగంగా ఢీకొంది. అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. ట్రైనీ ఎస్సై సతీష్ కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్ మంజునాథ్‌ను పరీక్షించగా మద్యం తాగినట్లు గుర్తించారు.

జిల్లా ఖ్యాతిని చాటాలి

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు

గద్వాల అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా ఖ్యాతిని చాటి చెప్పే విధంగా కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు అన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డీకే స్నిగ్ధారెడ్డి ఆదేశానుసారం గురువారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు. ఈ సందర్భంగా బండల వెంకట్రాములు మాట్లాడుతూ జనగామ జిల్లాలో నిర్వహించే 50వ జూనియర్స్ బాలుర కబడ్డీ స్టేట్ టోర్నమెంట్‌కు బయలు దేరుతున్న జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోటీల్లో విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కన్వీనర్ డి. అబ్రహం, కబడ్డీ కోచ్ తిరుపతి, మేనేజర్ కొత్త సురేష్, సర్వేశ్వర్‌రెడ్డి, నరసింహ, నాగేష్, చందు, రవి ఉన్నారు.



జిల్లా కబడ్డీ జట్టుతో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు

ధార్మిక కార్యక్రమాలకు పూర్తి తోడ్పాటు



ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధి కోసం తనవంతు పూర్తి తోడ్పాటునందిస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ప్రజల్లో మానసిక మార్పుతో పాటు సానుకూల దృక్పథం ఏర్పడుతుందన్నారు. గురువారం పట్టణంలోని 24వ వార్డు పరిధి రాఘవేంద్రకాలనీ వద్ద గల హనుమాన్ ఆలయ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే, చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడం ద్వారా ప్రజలకు సౌకర్యాలను మరింత మెరుగ్గా అందుబాటులోకి తేవాలన్నారు. పట్టణ అభివృద్ధి విషయంలో గడచిన ఆరేళ్లుగా అనేక కార్యక్రమాలను చేపట్టామని, అదే ఒరవడిని భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.7లక్షలతో ఆలయ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టినట్లు స్థానిక కౌన్సిలర్ టి.శ్రీనువాస్ ముదిరాజ్ తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, నరహరిగౌడ్, మురళి, పూడూరు కృష్ణ, నాయకులు గోవిందు, రిజ్వాన్, ధర్మనాయుడు, నాగేంద్ర యాదవ్, రామాంజి ఉన్నారు.

సందెరాళ్ల పోటీల విజేతలకు బహుమతులు



చాగదోణలో సందెరాళ్ల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

గట్టు(గద్వాల), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చాగదోణ గ్రామంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా గురువారం సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. పోటీలలో యువకులు ఉత్సాహంగా పాల్గొని సందెరాళ్లను ఎత్తారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. మొదటి విజేతకు రూ.5వేలు ఎండి బాబు అందజేశారు. ద్వితీయం విజేతకు రూ.3వేలు బొడ్డయ్యగాళ్ల నాగరాజు, తృతీయ విజేతకు రూ.2వేల నగదును ప్రభాకర్ అందజేశారు. నాలుగవ విజేతకు వెయ్యి నగదు బహుమతిని ఈదన్న అందజేశారు. అనంతరం దాతలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను ఊడ్చి వినూత్న నిరసన



గద్వాలలోని రాజీవ్‌మార్గ్‌లో రోడ్డు ఊడ్చుతూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

గద్వాల టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు 17వ రోజు గురువారం రాజీవ్‌మార్గ్‌లో పొరకలు చేతబట్టి రోడ్లను ఊడ్చుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఉద్యోగుల సమ్మెతో విద్యాశాఖలో స్తబ్ధత ఏర్పడిందని శిబిరం వద్దకు వచ్చిన రిటైర్డ్ ఎంఈవో స్వామి అన్నారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే జిల్లాలోని పలు ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా కొద్దిసేపు నిరసన తెలిపారు.

దీక్షలో జేఏసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హుసేనప్ప, గోపాల్, మహిళా అధ్యక్షురాలు ప్రణీత, గద్వాల అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ శేషన్న తదితరులు పాల్గొన్నారు.

అలంపూరు నుంచే బీఆర్ఎస్ విజయ పరంపర

- జనగాం ఎమ్మెల్యే పల్లా



జనగాం ఎమ్మెల్యే పల్లాతో అలంపూరు బీఆర్ఎస్ నాయకుడు శేషిరెడ్డి, లేపాక్షి భాస్కర్‌రెడ్డి

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి): అలంపూరు బీఆర్ఎస్ విజయం ఊహించినదే అని జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన తిరుమల దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో పుల్లూరు టోల్‌ప్లాజా పక్కన లేపాక్షి హోటల్ వద్ద బొంకూరు భాస్కర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులు బోరవెల్లి శేషిరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. అక్కడ కాసేపు సేదతీరి స్థానిక రాజకీయాలపై మాట్లాడారు. అలంపూరు ప్రజలు విజయుడిని గెలిపించుకుంటామన్న మాటను నిలబెట్టుకున్నారని అన్నారు. అలాగే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయ పరంపర అలంపూరు నుంచే మొదలు అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అలంపూరు వివక్షకు గురైందని, కేసీఆర్ హయాంలో ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు వచ్చాయన్నారు.

ఎల్‌వోసీ అందజేత



లబ్ధిదారుడికి ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అయిజ మండలంలోని పులికల్ గ్రామానికి చెందిన తెలుగు సుజాత అనారోగ్యంతో బాధపడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు చికిత్స కోసం మంజూరైన రూ.5లక్షల విలువైన ఎల్‌వోసీని గురువారం కర్నూలు నగరంలోని ఎమ్మెల్సీ బంగ్లాలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే విజయుడు అందజేశారు.

చైనా దురాగతాలపై భారత్‌లో బైక్ ర్యాలీ

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం నుంచి టిబెట్‌ను భారత్ కాపాడాలని టిబెట్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారతదేశంలో గ్రూపులుగా ఏర్పడి నవంబరు 22న అరుణాచల్ ప్రదేశ్‌లోని టిబెట్ ఇండో సరిహద్దులో చేపట్టిన బైక్ ర్యాలీ తెలంగాణలో పూర్తిచేసుకుని ఏపీలోకి ప్రవేశించింది. ఈసందర్భంగా టిబెటన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గొంపోదుందుప్, జాయింట్ సెక్రటరీ త్సెరింగ్ చోంఫెల్, మీడియా అధికారి లోబ్సాంగ్ గురువారం ఏపీ, తెలంగాణ సరిహద్దులోని పుల్లూరు టోల్‌ప్లాజావద్ద ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఇటీవల టిబెట్‌లో చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం ఖనిజ వనరులను దోచుకుంటుందని, అంతేగాక మానవ వనరులపై తీవ్రంగా విరుచుకుపడి నాశనం చేస్తుందన్నారు. చైనా దురాగతాలను బయట పెట్టేందుకుగాను చేపట్టిన ఈ ర్యాలీలో 19రాష్ట్రాల మీదుగా 15వేల కిలోమీటర్ల మేర పార్లమెంట్ సభ్యులు, లెజిస్లేటివ్ సభ్యులతో చర్చిస్తూ సాగుతుందన్నారు. చైనా టిబెట్ స్వాతంత్ర్యాన్ని దెబ్బతిస్తుందని, టిబెట్ స్వాతంత్ర్యం భారత్‌కు భద్రతగా వారు వర్ణించారు. ఇందుకోసంచైనాపై అంతర్జాతీయంగా ఒత్తిడి తీసు కురావాలని, టిబెట్ సహజ వనరుల దోపిడీని నిలువరించేలా చైనాపై అన్నిదేశాలు ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.